నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | HYDERABAD



## బీఆర్ఎస్ ప్రారంభించింది కాంగ్రెస్ వదిలేసింది

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రసూల్‌పుర కృష్ణానగర్ కట్టమైసమ్మ బస్తీలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే దివంగత సాయన్న నిధులు మంజూరు చేశారు. ఆయన హయాంలో పనులు కొనసాగాయి. ఆయన మరణం తర్వాత కమ్యూనిటీ హాల్ పనులు ఆగిపోయాయి.

## 30 రైళ్ల రద్దు.. 9 దారి మళ్లింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 30 రైళ్లను రద్దు చేసినట్టు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట-విజయవాడ సెక్షన్ మధ్యలోని ఖమ్మంలో జరుగుతున్న రైల్వే నిర్వహణ పనులుతో ఆ మార్గంలో తిరిగే పలు రైళ్లను రద్దు చేయాల్సి వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు రైళ్ల రద్దు ఉంటుందని, ఇదే మార్గంలో నడిచే మరో తొమ్మిది రైళ్లను దారి మళ్లించినట్టు తెలిపారు.

### ముగిసిన సంప్రదింపుల కమిటీ సమావేశం

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని 71వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం గురువారం ముగిసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులు, వినియోగదారుల సమస్యలపై చర్చించారు.

# సర్వీస్ రోడ్లు రోజురోజుకూ అధ్వాన్నం

### మరమ్మతులకు నోచుకోని రేడియల్ రోడ్లు, సర్వీస్ రోడ్లు

### ప్రణాళికలన్నీ ఫ్యూచర్‌సిటీ కోసమే

### నగర మౌలిక వసతులను పూర్తిగా విస్మరిస్తున్న ప్రభుత్వం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : 150 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగు రోడ్డు వెంబడి ఉన్న 300 కిలోమీటర్ల పైచిలుకు రేడియల్ రోడ్లు, సర్వీసు రోడ్లు రోజురోజుకూ అధ్వాన్నస్థితికి దిగజారుతున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో అత్యంత కీలకమైన సర్వీసు రోడ్లను, లింకు రోడ్లను అనుసంధానం చేయాల్సి ఉన్నా వాటన్నింటినీ వదిలేసి ఫ్యూచర్‌సిటీ వసతుల వైపు దృష్టి పెట్టారు. తాజాగా ఫ్యూచర్ సిటీకి హెచ్ఎండీఏ భారీ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రూపకల్పన చేసి.. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టింది. ఇప్పుడే ఏమాత్రం అవసరం లేని ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందే తప్ప.. నగర ప్రజలు వసతులకు సంబంధించి ప్రతినిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు అనుసంధానం అత్యంత కీలకమైనది. ఎయిర్‌పోర్టుకు చేరుకునేందుకు అవుటర్ రింగు రోడ్డు ఉపయుక్తంగా ఉండగా... మెట్రో నిర్మించాలనే ప్రతిపాదనలు గతకొంతకాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణానికి రాయదుర్గం లింకేజీ చేసేందుకు ప్రణాళికలు, బడ్జెట్ కేటాయింపులు కూడా పూర్తి చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రణాళికలను పక్కనపెట్టి, అలైన్‌మెంట్ మార్చి నాగోల్ నుంచి ఎల్బీనగర్ మీదుగా శంషాబాద్ అనుసంధానం చేయడంతోపాటు, అక్కడి నుంచి శంషాబాద్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా ముచ్చెర్ల ఫోర్త్ సిటీ వరకు మెట్రో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. శంషాబాద్ నుంచి ఫోర్త్ సిటీ వరకు మెట్రో నిర్మాణానికి అవసరమైన పూర్తి ప్రాజెక్టు రిపోర్టు రూపకల్పనపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ దృష్టి పెట్టింది. మూడు నెలల్లో ఫోర్త్ సిటీతోపాటు, నార్త్ సిటీని అనుసంధానం చేస్తూ భారీ మెట్రో అలైన్‌మెంట్ డిజైన్లు ఖరారు కానున్నాయి.

### తొలిసారిగా గ్రీన్ ఫీల్డ్ హైవే...

హైదరాబాద్ కేంద్రంగా తొలిసారి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఎయిర్‌పోర్టు నుంచి ముచ్చెర్ల ఫార్మా సిటీ వరకు 40 కిలోమీటర్ల పొడవైన ఆరు లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మిస్తోంది. ఇదీ అవుటర్ రింగు రోడ్డు నుంచి మొదలై ఫోర్త్ సిటీవరకు చేరనుండగా, అక్కడి నుంచి రీజనల్ రింగు రోడ్డు వరకు భవిష్యత్తులో విస్తరించేలా భూసేకరణ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని 21 గ్రామాల మీదుగా వెళ్లే ఈ హైవేను నిరసిస్తూ ఎంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న రోడ్లను విస్తరించకుండా... కొత్తగా గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం భూములు సేకరించడంపై ఆగ్రహంతో ఉన్నారు. ఫోర్త్ సిటీ పేరిట కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం సాగుతుందనే ఆరోపణలు ఉండగా... ఇప్పటికీ అవుటర్ రింగు రోడ్డును ఆనుకుని ఉండే సర్వీసు రోడ్డు కనీస మరమ్మత్తులు కూడా చేయడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి.

### ఫోర్త్ సిటీ హడావుడితో.. వసతుల లేమి

ఫోర్త్ సిటీ పేరిట కాంగ్రెస్ చేస్తున్న హడావుడితో హెచ్ఎండీఏ పరిధిలో ఇతర ప్రాంతాలకు తీరని నష్టం జరుగుతున్నది. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు బుట్టదాఖలు అవుతున్నాయి. ముఖ్యంగా హెచ్ఎండీఏ విస్తరించి ఉన్న ఏడు జిల్లాల పరిధిలో మెరుగైన రవాణా సౌకర్యాలను అందించే అంతర్గత, లింక్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు మరుగునపడుతున్నాయి. ఇక కోర్ సిటీ నుంచి అవుటర్ రింగు రోడ్డును అనుసంధానం చేస్తూ నిర్మించనున్న స్పైక్ రోడ్ల నిర్మాణంతోపాటు, ఓఆర్ఆర్ నుంచి కొత్తగా ప్రతిపాదన దశలో ఉన్న రీజనల్ రింగు రోడ్డు మధ్య రోడ్ల అనుసంధానం పక్కన పెట్టి... కేవలం ఫోర్త్ సిటీకి మాత్రమే మెరుగైన రవాణా సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నది. దీంతోపాటు గత కొంత కాలంగా నగరంలో పలు మార్గాల్లో మెట్రో విస్తరణ పెండింగ్‌లోనే ఉంది. కానీ యుద్ధప్రాతిపదికన ఫోర్త్ సిటీ వరకు శంషాబాద్ మీదుగా మెట్రో విస్తరించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం మెట్రో ఫేజ్-2 ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా... ఫేజ్-2 పార్ట్ బీ కింద శంషాబాద్-ఫోర్త్ సిటీ, నార్త్ సిటీ మార్గాలను నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలను మెట్రో సంస్థ సిద్ధం చేస్తోంది.





ఔటర్‌పై రేడియల్ రోడ్డు





ప్రాంక్‌లు చేసి జనాలను భయపెడుతున్న యూట్యూబర్లు

# ప్రాంక్‌తో పరేషాన్ జనాలకు టెన్షన్

### హద్దు మీరుతున్న ప్రాంక్‌లు

### వ్యూస్, యాడ్స్ కోసం

### యూట్యూబర్ల వికృత పోకడ

### ప్రాంక్‌లపై ఫిర్యాదు చేస్తే

### చర్య తీసుకుంటామంటున్న పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 ( నమస్తే తెలంగాణ) : ''నలుగురు అమ్మాయిలు గోల్కొండ కోటను వీక్షిస్తున్నారు. కోటపైకి ఎక్కి పరిశీలిస్తున్నారు. వాళ్లకు ఓ వ్యక్తి ఎదురుగా వచ్చి ఒక్కసారిగా వారిని నెట్టివేయడానికి ప్రయత్నించాడు. ఎవరో సైకో అనుకుని ఆ అమ్మాయిలు తలో దిక్కు పరుగెత్తడానికి ప్రయత్నించారు. ఇంతలో ఆ వ్యక్తి అరుస్తూ.. మేడం ఇది ప్రాంక్. అదిగో చూడండి అక్కడ కెమెరా ఉంది. అంటూ వారికి చెప్పాడు. ఆ అమ్మాయిలో ఇద్దరు ఆ ప్రాంక్‌ను సింపుల్‌గా తీసుకున్నారు.. మరో ఇద్దరు వారిపై సీరియస్ అయ్యారు. ఇలాంటి ప్రాంక్ వీడియోలు షూట్ చేసే ట్రెండ్ నగరంలో పెరిగిపోతుంది. దేశ వ్యాప్తంగా ప్రాంక్ వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ ధోరణి మంచిది కాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల హైదరాబాద్‌పోలీసులు ప్రాంక్ వీడియోలు చేసే వారికి హెచ్చరికలు జారీ చేశారు.

### అమ్మాయిలనూ ఇబ్బంది పెడుతున్నారు

ప్రాంక్ వీడియో సరదా కోసం చేసినా.. అది తెలియని వారు ఆ క్షణంలో భయభ్రాంతులకు గురవుతారు. ఒక్కోసారి ఏమీ తోచక ఎటువైపో పరిగెత్తే క్రమంలో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అకస్మాత్తుగా జనాల్ని భయభ్రాంతులకు గురిచేసే ఇలాంటి ప్రాంక్ వీడియోలను ఇటీవల పార్కులు, సినిమా థియేటర్లు, రద్దీ రోడ్లు తదితర జనారణ్య ప్రాంతాల్లో ఎక్కువగా షూట్ చేస్తున్నారు. కొంతమంది ప్రయాణిస్తున్న కారుకు ఎదురుగా వెళుతూ డ్రైవర్‌ను ఆటపట్టించే ప్రాంక్ వీడియో చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ప్రాంక్ వీడియోలను జనం ఎక్కువగా చూస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రాంక్ వీడియోలకు వీక్షకులు ఎక్కువగా ఉంటారు. లైకులు లక్షల్లో ఉంటాయి. ఈ స్థితినే కొంతమంది యూట్యూబ్ చానెళ్ల వారు క్యాష్‌గా మలుచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రాంక్ వీడియోలకు ఆదరణ ఎక్కువగా వస్తే ప్రకటనలు తద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు.ఎక్కువమందిని ఆకర్షించేందుకు ఏకంగా నడిరోడ్డుపైనే ఆకతాయి పనులు చేస్తున్నారు. ఒంటరిగా వచ్చే అమ్మాయిలను ప్రాంక్ పేరుతో కొంత మంది పోకిరీలు ఇబ్బంది పెట్టిన సంఘటన ఇటీవల ఇందిరాపార్కు వద్ద జరిగింది. ఓ బాధిత మహిళ.. లేక్ పెట్రోలింగ్ పోలీసులను పిలవడానికి ప్రయత్నించడంతో అక్కడి నుంచి ఆ ప్రబుద్ధులు జారుకున్నారు. కాలేజీ, ఆసుపత్రి, దేవాలయాలలో కూడా ప్రాంక్ వీడియోలు చేస్తూ జనాలను అవమనాపరిచే గ్యాంగ్‌లు పెరుగుతున్నాయి.

### జనం మధ్యనే ప్రాంక్‌లు

- ఇటీవల బైక్ స్టంట్ పేరుతో పబ్లిక్‌లోనే అలజడి సృష్టిస్తున్నారు. ఇటీవల ట్యాంక్‌బండ్‌పై కొందరు బైక్ స్టంట్స్ చేస్తూ వీడియోలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఆ సమయంలో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తింది.
- ఇటీవల కూకట్‌పల్లిలో హర్ష అనే ఓ యూట్యూబర్ డబ్బులు గాలిలోకి విసిరేసి న్యూసెన్స్ చేశారు. అక్కడున్న జనం ఆ డబ్బులు తీసుకోవడానికి పరుగెత్తడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.
- మనీ హంటింగ్ ఛాలెంజ్ అంటూ ఓ వ్యక్తి ఓఆర్ఆర్ వద్ద రూ.20 వేలను చెట్ల పొదల్లో డబ్బులు విసిరేశాడు. వచ్చి తీసుకోవచ్చంటూ ఈ వీడియోను యూట్యూబ్‌లో పోస్టు చేశారు. అయితే ఈ ఘటనలో రాచకొండ పోలీసులు మరునాడే అతడిని కటకటాల్లోకి పంపారు.

# ఏసీపీ మెడకు భూ వివాదం

### తలకొండపల్లిలో వ్యక్తిని బెదిరించి 30 ఎకరాల రిజిస్ట్రేషన్

### ఏసీపీ ఇచ్చిన లోకేషన్ ఆధారంగానే కిడ్నాప్ జరిగిందని విచారణలో వెల్లడి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ):

**ఓ భూ వివాదం ఏసీపీ మెడకు చుట్టుకుంది. చివరకు ఆయనపై సస్పెన్షన్ వేటుకు దారి తీసింది. తనకు తెలిసిన వ్యక్తి అడిగిన మేరకు అనుమతి లేకుండా మరో వ్యక్తికి సంబంధించిన ఫోన్ లోకేషన్లు సమకూర్చారు. చివరకు అది గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కిడ్నాప్‌కు దారి తీయడం.. 30 ఎకరాల భూమి చేతులు మారడం.. పోలీసు కేసు.. ఇలా మలుపులు తిరిగి విచారణలో అన్ని విషయాలు బయటపడటంతో ఉన్నతాధికారులు ఆ ఏసీపీని సస్పెండ్ చేశారు.**

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు చాలా ఏండ్లుగా నగరంలోనే ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ నేపథ్యంలో వ్యాపార లావాదేవీలకు సంబంధించి మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో తనకు డబ్బులు రావాల్సి ఉన్నందున.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలో చంద్రధర గ్రామంలో ఉన్న 50 ఎకరాల్లో 30 ఎకరాలను తన పేరిట చేయాలని సత్యనారాయణరాజు, శ్రీనివాసరాజుపై తీవ్రంగా ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టారు. ఇలా వీరిద్దరి మధ్య చాలాకాలం వివాదం కొనసాగింది. ఈ నేపథ్యంలో కోపంతో సత్యనారాయణరాజు ఎలాగైనా శ్రీనివాసరాజును బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం కిడ్నాప్‌నకు ప్రణాళిక రచించాడు. శ్రీనివాసరాజును కిడ్నాప్ చేయాలని ప్రణాళిక రూపొందించేందుకుగాను ఆయన కదలికలను ఫోన్ లొకేషన్ ద్వారా తెలుసుకోవాలనుకున్నారు. అయితే ఏసీపీ చాంద్‌పాషా కూడా పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో ముగ్గురికి మంచి సంబంధాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సత్యనారాయణరాజు సైబర్ క్రైం (సీసీఎస్)లో ఏసీపీ సహకారంతో శ్రీనివాసరాజు ఫోన్ లొకేషన్లను తెప్పించుకున్నారు. తెలిసిన వ్యక్తి అడగటంతో ఏసీపీ కూడా అనుమతి లేకుండానే ఎప్పటికప్పుడు లొకేషన్లను సమకూర్చాడు. దీని ఆధారంగా ప్రతిరోజు ఉదయం శ్రీనివాసరాజు కారులో తన కుమారుడిని పాఠశాల వద్ద దించివేస్తాడని గుర్తించిన సత్యనారాయణ, మరికొందరు కిడ్నాప్ చేసేందుకు అదే సమయం అనువుగా ఉంటుందని భావించారు. ఈ మేరకు 2023, నవంబరు 15వ తేదీన ఉదయం శ్రీనివాసరాజు తన కుమారుడిని పాఠశాలలో దించివేసిన తర్వాత ఉదయం 7.10 గంటల సమయంలో కొండకల్ పరిధిలోని నాగులపల్లి స్టేషన్ వద్ద కారును అటకాయించి, కిడ్నాప్ చేశారు. కిడ్నాప్‌కు గురైన సమయంలోనే శ్రీనివాసరాజు తన భార్యకు ఫోన్ చేసి అరవడం, ఫోన్ కట్ అవడం జరిగింది. కంగారుపడిన ఆమె తిరిగి ఫోన్ చేస్తే స్విచాఫ్‌గా రావడంతో వెంటనే శ్రీనివాసరాజు స్నేహితుడు చీకూరి సుబ్బరాజుకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పారు. ఉదయం 9.15 గంటల ప్రాంతంలో సుబ్బరాజు మోకిల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని వివరించి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా శ్రీనివాసరాజుకు చంద్రధాని, కొండకల్, శంకర్‌పల్లి, తలకొండపల్లి, ఇప్పాయిపల్లి, కేశంపేట ప్రాంతాల్లో భూములున్నాయని అందులో పేర్కొన్నారు. అంటే భూ వివాదాలకు సంబంధించే ఈ కిడ్నాప్ జరిగిందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఆ మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు మొదలుపెట్టారు.

### బెదిరించి..కొట్టి.. రిజిస్ట్రేషన్..

సత్యనారాయణరాజు, మరికొందరు కిడ్నాప్ చేసిన శ్రీనివాసరాజును భూమి రిజిస్ట్రేషన్ కోసం బెదిరించడంతో పాటు తీవ్రంగా కొట్టినట్లు బయటపడిన తర్వాత శ్రీనివాసరాజు పోలీసు విచారణలో చెప్పాడు. కిడ్నాప్ చేసి తనను తీవ్రంగా కొట్టి మరుసటి రోజే బలవంతంగా తలకొండపల్లి తాసిల్దార్ ముందు తీసుకుపోయి 30 ఎకరాల భూమిని సత్యనారాయణరాజు తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లుగా విచారణలో వెల్లడించారు. అయితే 2023, నవంబరు 15న కిడ్నాప్ అయిన మరుసటి రోజే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వాస్తవానికి అప్పట్లో తలకొండపల్లి తాసిల్దార్‌గా ఉన్న వెంకట రంగారెడ్డి అసెంబ్లీ ఎన్నికల విధుల్లో భాగంగా కల్వకుర్తిలో పని చేస్తున్నారు. నవంబరు 16వ తేదీన 12 మంది రైతులు భూ కొనుగోళ్లకు స్లాట్లు బుక్ చేసుకోగా... తాసిల్దార్ మాత్రం కల్వకుర్తి నుంచి వచ్చి కేవలం శ్రీనివాసరాజు-సత్యనారాయణరాజుకు సంబంధించి 30 ఎకరాల లావాదేవీని మాత్రమే పూర్తి చేసి, వెళ్లిపోయాడు. ఇందుకోసం సాయి అనే వ్యక్తి ద్వారా తాసిల్దార్‌కు పెద్ద ఎత్తున ముట్టచెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా శ్రీనివాసరాజు గాయాలతో ఉండటంతో పాటు అతనికి సంబంధించిన పాసు పుస్తకం, ఆధార్, పాన్ కార్డు... ఇవేవీ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు పోలీసు విచారణలో శ్రీనివాసరాజు తెలిపారు.

### 17 మందిపై కేసు నమోదు

**ఈ కిడ్నాప్ వ్యవహారంలో 17 మందిపై కేసు నమోదు చేసిన మోకిల పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి, ఛార్జిషీట్ వేశారు. ముఖ్యంగా ఏ-16గా ఏసీపీ చాంద్‌పాషా, ఎ-17గా తాసిల్దార్ వెంకట రంగారెడ్డిని చేర్చినట్లు తెలిసింది. ఇద్దరు ఉద్యోగుల హస్తం ఇందులో ఉండటంతో ఈ మేరకు మోకిల పోలీసులు రెవిన్యూ, పోలీసు శాఖలకు నివేదికలు ఇచ్చారు. అయితే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మాత్రం తాసిల్దార్ వెంకట రంగారెడ్డిపై బదిలీ వేటు వేశారు ప్రస్తుతం ఆయన మేడ్చల్ కలెక్టరేట్‌లో యూఎల్‌సీ విభాగంలో పని చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పోలీసు శాఖకు వచ్చిన నివేదిక మేరకు చర్యకు చాలాకాలం జాప్యం జరిగినట్లు తెలిసింది. చివరకు కొంతకాలం కిందట ఉన్నతాధికారులు ఏసీపీ చాంద్‌పాషాపై సస్పెన్షన్ వేటు వేశారు.**

# స్కూల్ వ్యాన్ కిందపడి విద్యార్థిని మృతి

### మరో విద్యార్థినికి స్వల్పగాయాలు

### శ్రీచైతన్య స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

### ఆందోళనకు దిగిన బీఆర్ఎస్, సీపీఐ పార్టీల నేతలు





మృతిచెందిన విద్యార్థిని రిత్విక (ఫైల్).. ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్

హయత్‌నగర్, ఫిబ్రవరి 6 : స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ విద్యార్థిని మృతి చెందింది. మరో విద్యార్థినికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం, అయ్యావారిపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలిగామ నర్సింహ, శ్రీలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ, హనుమాన్ హిల్స్‌లో నివాసముంటున్నారు. నర్సింహ స్థానికంగా లారీ మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. హయత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ఆయన పెద్ద కుమార్తె అనన్య(6) ఎల్‌కేజీ, చిన్న కుమార్తె రిత్విక(4) నర్సరీ చదువుతున్నారు. రోజూ మాదిరిగానే వారు స్కూల్ వ్యాన్ నెం.(టీఎస్ 18 టీ 1071)లో బడికి వెళ్లారు. సాయంత్రం స్కూల్ ముగియగానే స్కూల్ వ్యానులో ఇంటికి చేరుకున్న విద్యార్థినులను డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రివర్స్ తీసే క్రమంలో ఢీకొట్టాడు. రిత్విక కిందపడడంతో టైరు తలపైనుండి వెళ్లింది. అనన్య ఎగిరిపడడంతో స్వల్పంగా గాయపడింది. వెంటనే తేరుకున్న స్థానికులు రిత్వికను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


### బీఆర్ఎస్, సీపీఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన..

హయత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ ఎదుట బీఆర్ఎస్, సీపీఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మృతిచెందిన విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి రాకముందే పోలీసులు అత్యుత్సాహంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించడం ఏమిటని ఆందోళనకారులు ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోని న్యాయం చేసి సదరు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రోదిస్తున్న విద్యార్థిని తల్లి శ్రీలత

## ఉష్ణోగ్రత 33.5డిగ్రీలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం కంటే 0.7డిగ్రీలు తగ్గి 33.5డిగ్రీలుగాను, కనిష్ట ఉష్ణోగ్రతలు 1.7డిగ్రీలు పెరిగి 19.4డిగ్రీలుగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## తులం బంగారం ఎటుపాయె!

# ఆరు గ్యారంటీలు గల్లంతాయె!!

### కుల గణన అంతా తప్పుల తడక

### వాగ్దానాలను నెరవేర్చలేని చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్

### చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

### బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 6 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి వాటి అమలులో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. తులం బంగారం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు గల్లంతయ్యాయని ఎద్దేవా చేశారు. గురువారం తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, అడ్డగుట్ట, బౌద్ధనగర్ కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్, కంది శైలజ మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్‌తో కలిసి 91మంది లబ్ధిదారులకు 91 లక్షల విలువ చేసే కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. పెళ్లికానుకగా తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని చెప్పారు. కులగణన మొత్తం తప్పుల తడక అని, తూతూమంత్రంగా సర్వేని నిర్వహించి వందశాతం చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా అసమర్థ పాలనను కొనసాగిస్తున్నదని, నమ్మి ఓట్లేసిన ప్రజలకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతున్నదని ఆయన చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలు అడ్రస్ లేకుండా పోయాయని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అబద్ధాలపై ఎక్కువ రోజులు ముందుకు సాగలేమని స్పష్టం చేశారు. పేద ప్రజల కష్టాలను తెలుసుకొని పాలనను అందించిన ఘనత బీఆర్ఎస్‌దీ అని, ప్రజల సమస్యలను గాలికి వదిలి ఇబ్బందుల పాలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్కమధు, మనోహర్, సత్తయ్య గౌడ్, వసంత, ఎల్లయ్య, అమర్ బాన్సోడే, మహ్మద్, కుమార్ వంశీ, దేవయ్య, మోహన్, శ్రీనివాస్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### మళ్లీ కేసీఆరే సీఎం

కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు పూర్తిగా విసుగుచెందుతున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ కేసీఆర్‌యే సీఎం అవుతారని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ బంపర్ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. పోరాటానికిమ బీఆర్ఎస్ క్యారకర్తలు పెట్టిన పేరని, కష్టంలో కూడా బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడ్డారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే చిల్లర గొడవలకు, ఆకతాయి చేష్టలకు వెనకకు పోయేది లేదని, వాటి రెట్టింపుగా తిప్పికొడుతామని ఆయన పేర్కొన్నారు. కాగా, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య కొద్ది సేపు పెద్ద ఎత్తున వాగ్వాదం జరిగింది.



రియో పాయింట్ వద్ద గురువారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్